క్లుప్తంగా

యూట్యూబ్‌లో యోగదర్శన పారాయణం

● డయల్ యువర్ ఈఓలో ఏవీ.ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల నాదనీరాజనం వేదికపై పారాయణం చేసిన యోగదర్శనం శ్లోకాలను, వాటి అర్థాలను త్వరలో యూట్యూబ్‌లో భక్తులకు అందుబాటులో ఉంచుతామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి రూ. 39.76 లక్షలు

తిరుచానూరు : 2021– 22 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్వీయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి యూజీసీ రూ.39.76 లక్షలు మంజూరు చేసింది. వీసీ రాజారెడ్డి శుక్రవారం నిధుల మంజూరు పత్రాన్ని ఎస్వీయూ హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ కోదండరామిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, ఈసీ మెంబర్ మధు పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: విద్యుత్ లైన్ల నిర్వహణ మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, తిలక్‌రోడ్డు, కోటకొమ్మలవీధి, దొడ్డాపురం వీధి, అశోక్‌నగర్, గంగమ్మ గుడి ఏరియా, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం తెలిపారు.

రూ.10 లక్షల విరాళం



ఈవో ధర్మారెడ్డికి డీడీ అందజేస్తున్న దాతలు

తిరుమల: తిరుపతికి చెందిన ఆల్ ఇండియా ఆర్యవైశ్య వాసవి నిత్య అన్నదాన ట్రస్టుకు చెందిన ఉమామహేశ్వరి దంపతులు ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. డీడీని శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ సదస్సు ప్రారంభం

తిరుచానూరు: అప్లయిడ్ మ్యాథమ్యాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీలో మల్టీ డిసిప్లీనరీ అకడమిక్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ జాతీయ సదస్సు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ నేటికి అవసరమయ్యే మల్టీ డిసిప్లీనరీ రంగంలో పని చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.రవిశంకర్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రొఫెసర్ టి.సుధ, ఎన్‌సీఎంఏఆర్‌ఐ 2023 డైరెక్టర్ సి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు వితరణ



తిరుచానూరు: యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయానికి తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, సతీమణి మధు శుక్రవారం బంగారు ఆభరణాలు వితరణ చేశారు. వీరికి అర్చకులు అమ్మవారి దర్శనం కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాకాల: మండలంలో కోనప్పరెడ్డిపల్లె వద్ద శుక్రవారం రోడ్ సేఫ్టీ వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వేలూరుకు చెందిన గుణశేఖరన్ (65) శుక్రవారం భార్య సులోచన, కుమారుడు నందకుమార్, కోడలు కీర్తిక, కుమార్తె ఉమామహేశ్వరి, కుమార్తె బిడ్డలు కిషిత్ర, తేజస్వినితో కలిసి కారులో తిరుమల బయల్దేరారు. మండలంలోని కోనప్పరెడ్డిపల్లె వద్ద ఆపి ఉన్న హైవే రోడ్ సేఫ్టీ వాహనాన్ని కారు ఢీకొంది. గుణశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ పనుల్లో అలసత్వం వద్దు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల్లో అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీషతో కలిసి పనులను పరిశీలించారు. ఆలయ అధికారులు, టీటీడీ ఇంజినీర్లతో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, తులసీ యాదవ్, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యానికేతన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఉమాపతి తెలిపారు. ఆయన శుక్రవారం క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన క్రీడా పోటీల్లో శ్రీవిద్యానికేతన్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ప్రణీత, హరినారాయణ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, డీవీ ఎస్ఎన్.రాయల్, భవానీ ప్రతిభ చూపారని తెలిపారు. వీరు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. వారిని ఎంబీయూ చాన్సలర్ మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు, వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి, అధ్యాపకులు అభినందించారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల : మండలంలోని నేంద్రగుంటలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ధర్మకర్త ఓలేటి భక్తభూపాలప్రతాప్ చౌదరి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాల్గొని భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, నాయకులు నంగా బాబురెడ్డి, నంగా నరేష్ రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, మోహన్‌నాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గణేష్, సురేష్, శ్రీరాములరెడ్డి పాల్గొన్నారు.

భాకరాపేట పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

భాకరాపేట: జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం భాకరాపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తిరుపతి– మదనపల్లి జాతీయ రహదారిలోని భాకరాపేట కనుమలో నిరంతరం వాహనాల తనిఖీ చేపట్టి ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. పాత నేరస్తులు, అనుమానితులపై నిఘా పెట్టాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మాట్లాడి ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుని సమీక్షించారు. అనంతరం సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐలు చంద్రశేఖర్ పిళ్లై, డీసీఆర్‌బీ తులసీరాం భాకరాపేట ఎస్ఐ ప్రకాష్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న పెంచులయ్య

తిరుపతి మంగళం : అందరూ సమన్వయంతో పని చేసి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూద్దామని టీటీడీ ధర్మప్రచార పరిషత్ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ తిరుపతి 46వ డివిజన్ అధ్యక్షుడు పందలూరు పెంచులయ్య పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం తిరుపతి జీవకోనలో వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లతో కలిసి పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు గృహ సారథులు, కన్వీనర్లను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించినట్టు వివరించారు. అందరూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు పుష్పచౌదరి, బాలకృష్ణ, మురళి, స్వరూప్, ప్రసాద్, వినోద్, లక్ష్మి పాల్గొన్నారు.

సీఏ ఫౌండేషన్‌లో ఎమరాల్డ్స్ ప్రతిభ



డి.దామోదర్ యు.జైనమ్‌జైన్ ఎం.కార్తీక్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.దామోదర్ 292, యు.జైనమ్‌జైన్ 288, ఎం.కార్తీక్‌రెడ్డి 274 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాల్లో 60.43 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను వారు అభినందించారు.



వైభవంగా ఇస్కాన్ వార్షికోత్సవం

ఇస్కాన్ మందిరం 16వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాధా గోవిందుల సమేత అష్ట సఖులు, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు, నిత్యానంద ప్రభు ఉత్సవమూర్తులకు అభిషేకం, మూలవర్లకు పుష్ప యాగం చేపట్టారు. - తిరుపతి కల్చరల్

అలరించిన సంకీర్తన విభావరి

తిరుపతి కల్చరల్: శ్రీదివ్యాంగ్ సేవా కేంద్రం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సేవా కేంద్రం, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా శుక్రవారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన దివ్యాంగుల అన్నమయ్య సంకీర్తన విభావరి అలరించింది. మేయర్ శిరీష, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సతీమణి ప్రసన్న, టీటీడీ ఆస్థాన విద్యాంసుడు గరిమెల్ల బాలక్రిష్ణప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం గాయకులను సత్కరించారు. టి.సోమశేఖర్, మునిలక్ష్మి, తహసున్నీసా బేగం పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూముల పరిశీలన

తిరుపతి అర్బన్: తిరుపతి మంగళం పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 11.5 ఎకరాల భూములను శుక్రవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు పరిశీలించారు. వాటికి ప్రహరీ గోడ నిర్మించడానికి చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. భూములను సర్వే చేయించి పనులు చేపడతామన్నారు. ఏపీఈడబ్ల్యూఐసీ ఈడీ బాలసుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ సర్జన్‌రావుకు సత్కారం

తిరుచానూరు: కర్ణాటక వెటర్నరీ యూనివర్సిటీ బోర్డు సభ్యుడిగా నియమితులైన ఎస్వీ పశు వైద్య కళాశాల పరిశోధన సంచాలకుడు సర్జన్‌రావును శుక్రవారం వెటర్నరీ అసోసియేట్ డీన్ ఆదిలక్ష్మి తదితరులు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు

తిరుపతి కల్చరల్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శని, ఆదివారాల్లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, ఏపీ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీకల్ సొసైటీ కార్యదర్శి కె.సునీత తెలిపారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శనివారం స్క్రీనింగ్ క్యాంప్, ఆదివారం వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఎముకల పటుత్వ పరీక్షలు

తిరుపతి తుడా : క్యాల్షియం తగ్గినప్పుడే ఎముకల అరుగుదలతోపాటు పటుత్వం తగ్గుతుందని డాక్టర్ బి.సుకుమార్ తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఉన్న శ్రీసాయిసుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చంద్రగిరి: స్థానిక రాయలపురం పంచాయతీ వెంకటంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి పరిశీలించారు. ప్రీ స్కూల్ ప్రాధాన్యత, పోషకాహార ప్రాముఖ్యత, పిల్లల బరువు, పిల్లలు సెంటర్లలో భోజనం చేయడం తదితర అంశాలను ఆరా తీశారు.

యువకుడిపై లోన్‌యాప్ వేధింపులు

చంద్రగిరి: ప్రైవేటు లోను యాప్ వేధింపులపై బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. రాయలపురం పంచాయతీ తోటిపల్లికి చెందిన యువకుడు టకాపాట్ అనే యాప్ ద్వారా రూ.8,400 లోను తీసుకుని రూ.12,300లు చెల్లించాడు. యాప్ ప్రతినిధులు ఇంకా రూ.6,500 చెల్లించాలని యువకుడిని వేధింపులకు గురి చేశారు. అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి బంధువులు, స్నేహితుల వాట్సప్‌కు పంపించారు. దీంతో యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, సభ్యులు డీపీ ఆనంద్, శ్రీనివాసులు, భాను, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లికి చెందిన మునిపల్లవి, రాజేంద్రకు పెళ్లి నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ రెడ్డెప్ప అందజేశారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని వినతి

తిరుచానూరు : ఎస్వీయూలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వారు శుక్రవారం వీసీ రాజారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

భవనం నిర్మించాలని వినతి

తిరుపతి అర్బన్: ఎర్రావారిపాళెంలోని బాలికల గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ కోరారు. ఆయన శుక్రవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

● తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
● రూ.4.43 కోట్లతో సీమల్లవరం అభివృద్ధి



ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎంపీపీ మోహిత్ రెడ్డి, సర్పంచ్ మొక్కల భారతి

తిరుపతి రూరల్: ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పనిచేస్తున్నారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సి.మల్లవరం పంచాయతీలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఆయనకు సర్పంచ్ మొక్కల భారతి, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొక్కల తిమ్మారెడ్డి, గ్రామస్తులు ఘన స్వాగతం పలిపారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ సి.మల్లవరం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు రూ.4.43 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 33 రోడ్లకు రూ.1.63 కోట్లు ఖర్చు చేశామన్నారు. పలు భవనాల నిర్మాణానికి రూ.1.25 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. అదేవిధంగా రూ.35 లక్షలతో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, యోగా జ్ఞాన మందిరం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ కృష్ణవేణి బాబు, నాయకులు తిమ్మారెడ్డి, మల్లారపు వాసు, రమణ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

తిరుచ్చిపై అమ్మవారి చిద్విలాసం

తిరుచానూరు : తై మాసం మూడో శుక్రవారం సందర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేశారు. మధ్యాహ్నం శ్రీ కృష్ణ స్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని విశేషంగా అలంకరించి ఊంజల్ సేవ చేశారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు.

ముగిసిన జాతీయ సమగ్ర సర్వే శిక్షణ

తిరుచానూరు: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో చేపట్టిన జాతీయ పశు గణన సమగ్ర సర్వే శిక్ష ణ శుక్రవారం ముగిసింది. గ్రామస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానా న్ని కేంద్ర సర్వే సలహాదారు సుమిద్ సోఫాన్ నగ్రరే రాష్ట్ర, జిల్లా అధికారులకు వివరించారు. శాస్త్రవేత్త ప్రాచీ మిశ్రా, పశుసంవర్ధక శాఖ సంచాలకుడు అమరేంద్ర కుమార్, రవికుమార్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి

తిరుపతి అర్బన్: కళాతపస్వి కే.విశ్వనాథ్ మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరనిలోటని వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం తెలిపారు. తిరుపతి యూత్ హాస్టల్లో శుక్రవారం కే.విశ్వనాథ్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

86 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 86 మందికి రూ.44,810 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

చిన్నారులకు వరం ఎన్ఆర్ఎస్టీసీ పథకం

చంద్రగిరి: ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల పిల్లలకు వసతి రహిత ప్రత్యేక శిక్షణా కేంద్రం (ఎన్ఆర్ఎస్టీసీ) పథకం వరమని ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాయలపురం పంచాయతీ వెంకటంపేటలో శుక్రవారం సర్పంచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ 40 మంది చిన్నారులకు పలకలు, విద్యాసామగ్రి విరాళంగా అందజేశారు. ఎంఈఓ లలిత కుమారి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల పిల్లలను గుర్తించి వారికి ఇద్దరు విద్యా వలంటీర్లతో విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి, పిచ్చినాయుడు పల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, దేవారెడ్డి, పసల నాగరాజ, మించల ప్రవీణ్ పాల్గొన్నారు.

పూరీ ఫెస్టివల్ విజేతలకు సత్కారం



తిరుచానూరు: నేషనల్ యూత్ ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఆధ్వర్యంలో పూరీలో నిర్వహించిన అఖిల భారతీయ 26 గ్లోరీ ఫెస్టివల్‌లో ప్రతిభ చాటిన వారిని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్.క్రిష్ణమూర్తి శుక్రవారం ఘనంగా సత్కరించారు. అకడమిక్ డీన్ ఇన్‌చార్జ్ సి.చక్రవర్తి రాఘవన్ మాట్లాడుతూ విద్యార్థులు అధ్యయనంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. వాగ్వర్ధినీ పరిషత్ సంయోజకుడు కె.కుమార్, సహ సంయోజకుడు మనోజ్ షిండే, సోమనాథ్‌దాస్, పరమిత పండా పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చంద్రగిరి: దోర్నకంబాల పంచాయతీ తాటికోన ఎస్టీ కాలనీలో ఆత్మహత్యకు యత్నించిన సిద్ధయ్య(46) శుక్రవారం మృతిచెందాడు. అతను కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. గురువారం ఇంపురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఆయన భార్య కనకమ్మ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరైన సమయంలో దున్నాలి



డ్రిప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాకాల: మామిడి తోటల్లో సరైన సమయంలో దున్నాలని ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. ఆమె శుక్రవారం కావలివారిపల్లి పంచాయతీలోని తోటల్లో డ్రిప్ పైపులను పరిశీలించారు. కౌశిక్, ఏపీఎంఐ తులసీ, సుధాకర్, బాబు, గురుస్వామి పాల్గొన్నారు.

యువ గళమా.. నారా గర్వమా..?



మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి మంగళం : యువ గళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి లేక నారా వారి దర్బార్, గర్వాన్ని చూపించుకునేందుకా..? అని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ప్రశ్నించారు. ఆయన శుక్రవారం బైరాగిపట్టెడలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని పేర్కొన్నారు. ఆయనను జిల్లా వీరప్పన్ అని, దందాలు చేస్తున్నారని నారా లోకేష్ విమర్శించడం దారుణమన్నారు. విమర్శలు చేసే ముందు తన స్థాయి ఏమిటో తెలుసుకోవాలన్నారు. మల్లారపు మధు, బండ్ల లక్ష్మీపతి, మంగళంపేట సురేష్‌బాబు, హరి షోహన్‌నాయక్, నాగేంద్ర, రాజశేఖర్, దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్న నుంచే ప్రాపంచిక విజ్ఞానానికి చేరువ

తిరుచానూరు: ప్రశ్ననుంచే మనిషి ప్రాపంచిక విజ్ఞానానికి చేరువ అవుతారని ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆర్.రాజేశ్వరమ్మ తెలిపారు. తెలుగు విభాగంలో ఐదు రోజులుగా నిర్వహించిన వర్క్ షాప్ శుక్రవారం ముగిసింది. ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తెలుగు భాషా సాహిత్యంపై అవగాహన పొందడంతో పాటు ప్రశ్నాపత్రాన్ని రూపొందించే విషయంపై నైపుణ్యం పొందినట్టు తెలిపారు. మైసూర్‌లోని భారతీయ భాషల అధ్యయన కేంద్రం (సీఐఐఎల్) ప్రతినిధి ఎం.నారాయణ రెడ్డి మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్స్ తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారని వివరించారు. తెలుగు అకడమిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి, సీఐఐఎల్ ప్రతినిధులు బీరేష్ కుమార్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

తిరుపతి కల్చరల్: వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో హోటల్ కెన్సెస్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టీవీ.రావు మాట్లాడుతూ వివాహ, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే విధంగా దేశంలో ఎంతో పేరు గాంచిన వివిధ రకాల వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, కాశ్మీర్ సిల్క్, ప్రింట్, సిల్క్ చీరలు, బ్లౌజ్‌లు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శన శనివారంతో ముగిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రొఫెసర్ గణేష్ సేవలు ప్రశంసనీయం



గణేష్‌ను సత్కరిస్తున్న శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్) డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్.గణేష్ సైన్స్ రంగంలో చేసిన సేవలు ప్రశంసనీయమని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ గణేష్‌ను శుక్రవారం వారు సత్కరించారు. పరిశోధనా రంగంలో శ్రీరామ కళాశాలకు అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని ప్రొఫెసర్ గణేష్ వారికి తెలిపారు.

ప్రొఫెసర్ నారాయణ రెడ్డికి పేటెంట్

తిరుచానూరు : ఎస్వీ యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్ నారాయణ రెడ్డి ప్రతిష్టాత్మకమైన పేటెంట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ వీసీ కె.రాజారెడ్డి ఆయనకు పేటెంట్ పత్రాన్ని అందించారు. డాక్టర్ సి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎస్.నారాయణ రెడ్డి సంయుక్తంగా సిద్ధం చేసిన 'డిజైన్ అండ్ పెర్ఫామెన్స్ అనాలసిస్ ఆఫ్ డిస్క్రీట్ వేవ్లెట్ ట్రాన్స్‌ఫార్మ్ బేస్ట్ ఇమేజ్ ఫ్యూజన్ అండ్ కంప్రెషన్ ఫర్ మైక్రో ఎయిర్ వెహికల్ అప్లికేషన్స్' అనే అంశానికి 419630 నంబరుతో భారత ప్రభుత్వం తరపున ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా వారు పేటెంట్ మంజూరు చేశారు.